# అనుమానం

నాగరాజు భార్య పుట్టింటికి వెళ్ళి నాలుగు నెలలు గా వొచ్చింది. వెంకాయమ్మ ఇంతకాలం ఎందుకు పుట్టింట్లో వుందో నాగరాజుకు అర్థంగాలేదు. తమ్ముడి పెళ్ళికని పోయిన మనిషి వెంకాయమ్మ తమ్ముడి అత్తగారింట్లో అరణంతినడంగూడా అయిపోయి పదిరోజులయింది. నాగరాజు అయిదారు కార్డులు రాశాడు మామగారి పేర. భార్యకుగూడా రెండు ప్రేమలేఖలు రాశాడు విరహసందేశాన్ని నింపి. మనుషుల్నిగూడా పంపించాడు. ఏమీ లాభం లేకపోయింది. వాళ్ళు దేనికీ సమాధానం చెప్పలేదు. కనీసం 'పిల్ల'ను పంపుతామనో, పంపమనోగూడా చెప్పరు.

నాగరాజు ఇంతపని చేశాడుగానీ తనుమాత్రం భార్యను తీసుకొచ్చిందికి వెళ్ళలేదు. పాపం నాగరాజు వెళ్ళలేదు వాళ్ళ యింటికి. కార్యమయిన తొలిరోజుల్లో 'భార్య' కోసం తెగ తిరిగాడు నాగరాజు. తొలిరోజుల్లో అత్తమామలకు అది ముద్దుగానేవుంది. కూతురూ, అల్లుడూ, ఎప్పుడూ గది విడకుండా వుంటుంటే వాళ్ళు గదిలో వున్నట్టేఅనుకొని సంతోషించారుపాపం! అంతటితో నాగరాజు ఆగిపోయినట్లయితే ఎంతో బాగుండేది!

ఒక రోజు నాగరాజును వాళ్ళత్త అడిగింది.

"ఏం నాయనా వూరికే కూచున్నావు. ఇంటిదగ్గర పనీ పాటా ఏమీ లేదా ఏమిటి? ఇట్లావుంటే ఎట్లా జరుగుతుంది బాబూ మనబోటోళ్ళకి" అన్నది.

నాగరాజుమామ భార్య మీద విరుచుకుపడ్డాడు అల్లుడిముందు.

"ఎక్కడ చచ్చేదే నీ నోరుబడ? ఎంతడబ్బు తెచ్చినా మీ బొందలు పొడుగుచెయ్యడానికే చాలడంలేదా మె. తే. తే. తే. ఎక్కణ్ణించి తెచ్చేది? పదిరోజులు గాలేదు వీసెడు నెయ్యి తెచ్చి. అప్పుడే తెప్పాళాకడిగి చేతికిస్తివి. అరబస్తా బియ్యం వారం రోజులన్నా రాండి నన్ను దేంటోనన్నా దూకి చావమంటావా? వుప్పులేదు, పప్పులేదు, నూనెలేదు, చక్కెర లేదు, కాఫీగుండలేదు. లేదు. లేదు. లేదు. ఏమీలేదు, లేదనే మాటతప్ప. నీబొందలో నినుదాస్తే వున్నదీ అన్న అక్షరాలే నీ నోటంట రావాయె! మరి నీ నోరేంనోరో! నీ నోట మట్టి గొట్ట......అదికాదు నాగరాజూ! సంసారమన్న తరవాత... ఎందుకులే నాయినా! ఇదంతా నా ఖర్మ! ఈ చుట్టాలు. ఈడబ్బు, ఈ పిల్లలు, ఈ పెళ్ళాంతో చస్తున్నాను. నా గడ్డి నేను తిని ఎదుటిదానికి చెయి చాపుతున్నానంటే నమ్ము. ఇదంతా నా ఖర్మ, ఖర్మ!" అన్నాడు నాగరాజు మామ.

"ఇది మరీబాగుంది. ఆడలేక మద్దెలమీదబడి లబ్బున్నట్టు మీరు నామీదబడేడుస్తారేం! వీసెడు నెయ్యి నా బొందకేసి కొట్టుకోలా. అందరి బొందలకూ కొట్టాను. అరబస్తా బియ్యం వారంరోజు లెట్లావస్తై అందరూ ముప్పూటూ పొట్టపగలకొట్టుకు నేవాళ్ళేనాయె! వుప్పు, పప్పు అయిపోతున్నాయంటే అయిపోవూ? నీ పెద్దకూతురుకు యిన్నేళ్ళొచ్చినయ్. ఈనాటికీ అది అలమారాలు పగలగొట్టి తినటం మానలేదు. నీ రెండోకూతురో, అదొకటి తిపాచిముండ, బైలుకెళ్ళే

చెంబులో బియ్యాలు, పప్పులు పోసి అమ్ముకుతింటుంటే ఎట్లా వస్తయ్? వాళ్ళనేమీ అనలేక నామీద విరుచుకుపడతావేం? అల్లుడికన్నా వొక్కఘార ఎక్కువ వెయ్యకపోతే యీమను క్కొంటాడు? ఛీఛీ! నా జన్మ చవిటిలో పెడితే ఏ విషాముష్టి వేళ ఈ కొంపలో దిబ్బేసుకొన్నామో ఈనాటివరకూ. వొకప్పుడు గాకపోయినా వొకప్పుడైనా నామనస్సుకు కాస్త 'విశ్రాంబరం' లేకపోయె. నా బతుకు బూడిదగాను. ఆ నారాయణమూర్తి నా పోటిదాన్నన్నా దబ్బున తీసికెళ్ళడు, ఆ కామయ్యను తీసి కెళ్లినట్లు ..." అంటుంది ఆమెగారు, వంటింటిగడపలో పైట చెరగుమీద పడుకొని ఏడుస్తూ.

ఇక నాగరాజు ఏముఖంపెట్టుకొని వాళ్లింట్లో వుంటాడు? ఏ ముఖంపెట్టుకొని వాళ్లింటికెడతాడు?. వెంకాయమ్మపోయి నాలుగు మాసాలు గావొచ్చు. అయితేమాత్రం?

ఇంతకాలం అది పుట్టింట్లో ఎందుకున్నదో నాగరాజుకు చప్పున అర్థంగాలేదు. ఒక్కతే పిల్లమ్మ తల్లీదండ్రీ ప్రేమచాత విడిచిపెట్టలేకుండా వున్నారనుకోడానికిఅదీగాదు.అయితే ఇంటిపనేమన్నా అందుకొంటుందేమోనని సరిపెట్టుకోడానికి గూడా వీల్లేదు. వెంకాయమ్మకా పని చాతకాదు. అది కాఫీ గాస్తే చూరునీళ్లకంటే హీనంగా వుంటయ్. చెంచాడు కాఫీ గుండ వేసి పదిమందికి కాఫీగాస్తుంది. రెండు వంకాయలు, నాలుగు దోస వరుగులూ వేసి పులుసుచేస్తుంది. పదిమందున్న కొంపలో ఇవి చద్దన్నాల్లోకిగూడారావు. అది వంటచేసిన రోజున యింటిల్లిపాదీ అర్థకాడు తినాలిసిందే! పట్టె పాచి ముండ. డబ్బుకీ ప్రాణానికీ లంకె వేసుకొంటుంది. ఇంట్లో ఎవరి

తోటీ అది మనసిచ్చి మాట్లాడదు. అందరితోనూ పోరు బెట్టుకుంటుంది. వెంకాయమ్మకు రెండో పురుగుండటం గిట్టిచావదు' ఇంతకాలం అదెట్లావుందో అక్కడ? కాపరానికొచ్చిన నెలా ఇరవైరోజులకే అన్న పెళ్ళికనిపోయింది. పికరు లేదు ఇప్పటికి—

అతాత్తుగా వెంకాయమ్మశీలంమీదికి నాగరాజు మనసుమళ్ళింది. అది ఎవణ్నన్నా మరిగిందేమో? ఏమో భగవంతుడికి తెలియాలి నిజానిజాలు. ఈ కారణం నాగరాజుకు ఎందుకనో నచ్చింది. అది తనతోవున్న యాభైరోజులూ, బలవంతాన వున్నట్టుగానే నాగరాజుకు అనిపించింది. అప్పుడు తనే కనుక్కోలేకపోయ్యాడు బుద్ధితక్కువ వెధవ. అమ్మ ముండా! ఎంతదగాచేసింది!!

నాగరాజుకు తన అనుమానం బలపడుతున్నట్లుగా తోచింది. వెంకాయమ్మను లోగడ ఎవడో పుల్లాయకి ఇస్తామన్నారు. ఆ పుల్లాయని ఈ పుల్లమ్మ 'తా' చేసిందట. అంతా అనుకొన్న తరవాత సంబంధం చిట్లిపోయింది. తరవాత నాగరాజు కిచ్చిచేశారు. ఆపుల్లాయది ఆ వూరే! ఇంకేం ఈముండ వాడితో......అందుకనే తనభార్య పుట్టింట్లో నాలుగు నెలలుండటానికి కారణమని నాగరాజు తీర్మానించుకొన్నాడు.

పాపం! ఈ అనుమానంతో నాగరాజు మనస్సు చివుక్కుమంది. లోకులందరూ తన్ను చూసి నవ్వుతున్నట్లుగానే వుంది. ఇదివరకు చాలామంది ఇతర్ల భార్యలను గురించి నాగరాజు లోగడ మాట్లాడాడు. అట్లాగే తన్ను గురించికూడా చాలామంది అనుకొంటారని నాగరాజు వూహించాడు. ఈవూహతో నాగరాజుకు పిచ్చెక్కినంతపని జరిగింది. కూడా

నీళ్ళుగూడా మానేశాడు. అసలు అతనికి అన్నం తినబుద్ధెయ్యలేదు. నీళ్లుతాగబుద్ధెయ్యలేదు. గుడ్డకట్టుకోబుద్ధెయ్యలేదు. దిగనాసిల్లిపోయినాడు. చిక్కి శల్యమై పోయినాడు. పీనిగమల్లే తయారైనాడు, పిల్ల ఏనుగకుమల్లే వుండే నాగరాజు.

ఒకనాడు అతాత్తుగా వెంకాయమ్మ వొచ్చింది. మణుగు చలిమిడీ, బానెడు అరిసెలూ, మినపసున్ని వుండలూ తెచ్చింది వొస్తూవొస్తూ. నాగరాజు మాట్లాడలేదు. వెంకాయమ్మ రాకకు సంతోషానికి బదులు అసహ్యం కలిగింది. మొఖం గోడ చెంపకు తిప్పుకొన్నాడు నాగరాజు.

"విడప్పుడు ఎట్టావున్నా యిబ్బందిలో ఆనుకొన్నావమ్మా! బిడ్డడు? కూడేళ కూడు, నీళ్ళేళ నీళ్ళా ఎరుగునా? పండునాయనల్లేవుండే నాగరాజు పూచికపుల్లయినాడు. అయితే ఇంతకాలం అక్కడేవుంటే ఇక్కడ ఎట్లాఅనుకొన్నావమ్మా? నాలుగు నెలలయిందిగదా పోయి, కాకపోతే వొస్తూపోతూ వుండకపొయ్యావా వెంకూ?" అన్నది పక్కింటి మంగమ్మ.

"అప్పుడు మా వారు నూటడెబ్బయ్ పౌన్ల బరువువుండేవారు. చచ్చిపోయేదాన్ని మంగమ్మ పిన్నీ ఇక్కడవుంటే. బతకనివ్వడనీ, ఎప్పుడో కాలో చెయ్యో విరిచేస్తాడనీ భయపడ్డాను. తల్లిలాంటిదానివని నీతో అంటున్నాను పిన్నీ! అంత లావాంటి 'హారి' తో వేగలేకనే వెళ్ళిపొయ్యాను. ఇప్పుడు సన్నబడ్డారు. నూటపాతిక పౌన్లబరువే వున్నారట. నామీద అనుమానంతో చిక్కిపొయ్యారనిగూడా నాకు తెలుసు. అందుకే మళ్ళీవచ్చాను." అన్నది—వెంకాయమ్మ సిగ్గు లేకుండా.